క్లుప్తంగా

మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

ఇబ్రహీంపట్నం రూరల్: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రిపదవి ఇవ్వాలని తెలంగాణ కమ్యూనిటీ పారామెడికల్ వైద్యుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఉక్కుల అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ గుర్తుతో గెలిచిన ఏకైక ఎమ్మెల్యే మల్‌రెడ్డి మాత్రమేనన్నారు. ఇప్పటికి మూడుసార్లు శాసనసభకు గెలిచిన అనుభవం ఉన్న నేతకు క్యాబినెట్‌లో చోటు ఇవ్వాలని ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడ గాంధీ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడతామని పేర్కొన్నారు. ఏఐసీసీ, రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇచ్చే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.

లోయపల్లిలో కంటి వైద్య శిబిరం



శిబిరంలో పరీక్షలు చేసుకుంటున్న గ్రామస్తులు

మంచాల: బీజేపీ ఆధ్వర్యంలో మండలంలోని లోయపల్లిలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్ పేయి శత జయంత్యుత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేశారు. ఇందులో 90 మందికి పరీక్షలు నిర్వహించగా.. 15 మందిని ఆపరేషన్ అవసరం ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో సాదురం కంటి వైద్యశాల వైద్యుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్, కిరణ్, భాను, విక్రమ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన ముసుగులో పోలీస్ రాజ్యం

సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్


చేవెళ్ల: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పోరాటాల మీద నాయకుల మీద నిర్బంధం పెరిగిందని ప్రజాపాలన ముసుగులో పోలీస్ రాజ్యం చేస్తోందని సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. చేవెళ్లలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు అనేక మాయమాటలు చెప్పి కేసీఆర్ నియంత అని మేం ప్రజాస్వామ్యవాదులమని ప్రజలను నమ్మించి ఎన్నికల్లో గెలిచారన్నారు. అధికార పీఠం ఎక్కిన వెంటనే రేవంత్‌రెడ్డి నియంతలా వ్యవహరించటం సరికాదన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములను యూనివర్సిటీకే చెందేటట్లుగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

ముందస్తు అరెస్టులపై మండిపాటు

పోలీసులు ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్ అన్నారు. చేవెళ్లలో వారిని పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హెచ్‌సీయూ భూముల వేలానికి వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు ధర్నాకు పిలుపునిచ్చాయని, ధర్నాకు వెళ్లకుండా ముందస్తు అరెస్టులు చేయటం సరైనది కాదన్నారు. భూములను యూనివర్సిటీకే అందించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు సమీర్, చందు, రమేశ్, తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

చేవెళ్ల కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు

చేవెళ్ల: కోర్టుల్లో న్యాయవాదుల సమస్యలు, కోర్టు సమస్యలను పరిష్కరించుకునేందుకు బార్ అసోషియేషన్ తరఫున కృషి చేస్తామని చేవెళ్ల కోర్టు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల కోర్టులోని బార్ అసోసియేషన్‌లో మంగళవారం నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఈ బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన సీనియర్ న్యాయవాదులు రవిశంకర్‌గౌడ్, పాండురంగారెడ్డి నూతన కమిటీకి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అందరం కలిసి చేవెళ్ల కోర్టు బార్ అసోసియేషన్‌ను అభివృద్ధి చేసుకుందామన్నారు. నూతన కమిటీలో బాధ్యతలు స్వీకరించిన వారిలో ఉపాధ్యక్షులు కృష్ణగౌడ్, నర్సింలు, ప్రధాన కార్యదర్శి మహేశ్‌గౌడ్, సంయుక్త కార్యదర్శి యాదగిరిగౌడ్, ట్రెజరర్ రవీందర్‌రెడ్డి, లైబ్రేరియన్ మల్లేశం, శివరాజ్, రవీందర్ తదితరులు ఉన్నారు.

సన్న బియ్యం.. మురిసిన జనం

- గ్రామాల్లో రేషన్ దుకాణాలకు బారులుతీరిన లబ్ధిదారులు
- ఆయా చోట్ల ప్రారంభించిన నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు నియోజకవర్గాల్లో ఉదయం నుంచే దుకాణాల వద్ద లబ్ధిదారులు వరుస కట్టారు. అనంతరం సన్న బియ్యాన్ని పొంది ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇన్ని రోజులు దొడ్డు రకం తినలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని చెప్పారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సన్న బియ్యం పంపిణీ నిర్ణయాన్ని స్థానికులు హర్షించారు. స్థానిక నేతలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

విశేష ఆదరణ



తులేకలాన్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న స్థానిక నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: సన్నబియ్యం పంపిణీకి విశేష ఆదరణ లభించింది. మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందజేశారు. అలాగే ఆదిబట్ల మున్సిపాలిటీలోని 15 వార్డుల్లో కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోరణాలు కట్టి



గడ్డమల్లయ్యగూడలో సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ సురేందర్‌రెడ్డి

యాచారం: రేషన్ కార్డుదారులకు సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ సన్నబియ్యం పంపిణీని ప్రారంభించింది. మండల పరిధిలోని పలు గ్రామాల్లో అధికార పార్టీ నేతలు రేషన్ దుకాణాల వద్ద మామిడి తోరణాలు కట్టి, కొబ్బరికాయలు కొట్టి శ్రీకారం చుట్టారు. లబ్ధిదారులు ఎంతో సంతోషంగా బియ్యాన్ని తీసుకెళ్లారు.

పేదలకు వరం లాంటిది

కడ్తాల్: ప్రభుత్వం అందజేస్తున్న సన్న బియ్యం పేద ప్రజలకు వరమని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాటగీత, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు, మండల పరిధిలోని చల్లంపల్లి, సాలార్‌పూర్, వంపూగూడ గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



రేషన్ బియ్యం ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజా సంక్షేమమే ధ్యేయం



మేడిగడ్డ తండాలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా కాంగ్రెస్ నాయకుడు మండ్లీ రాములు, మాజీ ఎంపీపీ అనిత విజయ్‌లు అన్నారు. మండల పరిధిలోని మేడిగడ్డతండాలోని రేషన్‌షాపులో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించారు. ఆకుతోటపల్లి గ్రామంలో మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రేషన్ దుకాణం వద్ద సన్నబియ్యం కోసం ఎగబడిన ప్రజలు

దుకాణాల వద్ద పడిగాపులు

ఇబ్రహీంపట్నం: తొలిరోజు సన్న బియ్యం తీసుకొనేందుకు లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు ఎగబడ్డారు. ఇబ్రహీంపట్నంలోని పలు షాపుల వద్ద రద్దీ నెలకొంది. సన్న బియ్యం అయిపోతాయనే భ్రమలో ప్రజలు విపరీతంగా వచ్చి పడిగాపులు కాశారు. పూర్తి స్థాయిలో స్టాక్ ఉందని డీలర్లు చెబుతున్నా కార్డుదారులు పట్టించుకోవడంలేదు. డివిజన్‌లోని యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల్లోని 89 రేషన్ దుకాణాలకు 900 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని ఇప్పటికే చేరవేశారు.

మాడ్గులలో..



కొల్కులపల్లిలో సన్న బియ్యం పంపిణీ

మాడ్గుల: మండలంలోని కొల్కులపల్లిలో సన్నబియ్యం పంపిణీ పథకాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



చుక్కాపూర్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తలకొండపల్లి: రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేపట్టినందుకు స్థానిక కాంగ్రెస్ నేతలు సంబురాలు నిర్వహించారు. మండల పరిధిలోని చుక్కాపూర్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అంతకుముందే ఆయా గ్రామాల్లో స్థానిక నేతలు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు.

మంచాలలో..

మంచాల: మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ పథకం ప్రారంభించారు. ఆరుట్లలో కాంగ్రెస్ నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి నేతలతో కలిసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎల్లేష్, పాండు నాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జాపాలలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం

కల్వర్టు ధ్వంసం.. ప్రయాణం కష్టం



ప్రమాదకరంగా మారిన సాహెబ్‌గూడ రోడ్డును చూపిస్తున్న వాహనదారుడు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రమాదకరంగా మారిన రహదారితో వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. మంగళ్‌పల్లిగేటు నుంచి సాహెబ్‌గూడ మీదుగా కొంగరకలాన్ కలెక్టరేట్‌కు వెళ్లే ప్రధాన రోడ్డుపై కల్వర్టు ధ్వంసమై ప్రయాణానికి అవరోధం కలిగిస్తోంది. గత వర్షాకాలంలో ఫిరంగి నాలా క్రుంగి పోయింది. రోజూ వందల సంఖ్యలో ఈ మార్గంలో వాహనాలు వెళుతుంటాయి. అనుకోని ప్రమాదం జరిగితే తీవ్ర నష్టం వాటిల్లే ముప్పు పొంచి ఉంది. ఇదే మార్గంలో రెండు రోజుల క్రితం ఓ పాఠశాల స్కూల్ వ్యాన్ లారీ ఎదురుపడటంతో వాగులోకి బస్సు ఒరిగింది. అప్పుడు 20 మంది వరకు పిల్లలు బస్సులోనే ఉన్నారు. అయినా రోడ్డును బాగు చేయడం లేదని వాహనదారులు మండిపడుతున్నారు. ఓ వైపు ఆదిబట్ల మున్సిపాలిటీ అభివృద్ధిలో దూసుకుపోతుంటే మరో వైపు రోడ్ల దుస్థితి ఇలా ఉందని వాపోతున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్డును బాగు చేయాలి

మంగళ్‌పల్లి నుంచి కొంగరకలాన్ వెళ్లే దారిలో సాహెబ్‌గూడ గేటుకు సమీపంలో పూర్తిగా ధ్వంసమైంది. రాత్రిపూట రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

– బలరాంయాదవ్, మాజీ సర్పంచ్, పోచారం

రాజీవ్ యువ వికాసం గడువు పొడిగింపు

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 14వరకు పొడిగించినట్లు ఎంపీడీఓ కుసుమ మాధురి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీ సేవ కార్యాలయం లేదా, మండల పరిషత్ కార్యాలయంలోని ప్రజాపాలన కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు పండ్ల పంపిణీ

ఇబ్రహీంపట్నం: బీసీ సంఘం జిల్లా నాయకుడు బజారు భిక్షపతి తన తండ్రి వర్ధంతిని పురస్కరించుకొని వినోభానగర్‌లోని స్ఫూర్తి జ్యోతి ఫౌండేషన్‌లోని అంధ విద్యార్థులకు మంగళవారం పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. భవిష్యత్తులో సైతం ఫౌండేషన్‌కు తన సహకారం ఉంటుందని తెలిపారు.

కళాకారులకు డప్పుల అందజేత

మంచాల: మండలంలోని కళాకారులకు మంగళవారం వీఆర్‌వన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా డప్పులు పంపిణీ చేశారు. లోయపల్లి, చెన్నారెడ్డిగూడ, బండలేమూర్ గ్రామాల్లో వంద డప్పుల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌వన్ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, ఆర్గనైజర్లు బాలరాజు, మల్లేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్‌-1లో మెరిసిన యువకుడికి సన్మానం



మల్లేశ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు: పట్టణంలోని గుర్రంగుట్ట కాలనీకి చెందిన కావటి యాదయ్య, పార్వతమ్మ దంపతుల కుమారుడు మల్లేశ్‌యాదవ్ గ్రూప్‌-1లో ప్రతిభ చూపి మంచి ర్యాంకు సాధించారు. ఆయన ఇదివరకే మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై సత్తాచాటగా.. తాజాగా వెలువడిన గ్రూప్‌-1 ఫలితాల్లో మెరిట్ లిస్ట్‌లో రాష్ట్రస్థాయి 187వ ర్యాంకు సాధించాడు. మల్టీజోన్‌-2 విభాగంలో 92వ స్థానంలో నిలిచాడు. ఈ మేరకు మంగళవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు కండె హరిప్రసాద్, మాజీ ఎంపీపీ లలితవెంకటయ్యలు అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు శ్రీశైలం, విజయ్‌కృష్ణ, నర్సింహ, మాజీ సర్పంచ్ బక్కి కుమార్, గిరి, శ్రీనివాస్, కరుణకర్, భరత్, శ్రీను, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు పర్యటన జయప్రదం చేయండి

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: మండల పరిధిలోని బోయిన్‌గుట్ట, ముద్విన్ గ్రామాల్లో ఈనెల 3న మాజీ మంత్రి హరీశ్‌రావు పర్యటించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నివాసంలో బీఆర్‌ఎస్ పార్టీ కల్వకుర్తి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హరీశ్‌రావు పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, అందుకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతుల సమస్యలు ప్రభుత్వానికి తెలిసేలా పోరుబాట కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం, నాయకులు వీరయ్య, అర్జున్‌రావు, జ్యోతయ్య, రవి, నర్సింహ ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

డప్పు కృష్ణ ఆశయ సాధనకు కృషి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

షాద్‌నగర్: కులవివక్ష నిర్మూలనకు కృషి చేసి ఉద్యమాన్ని నడిపించిన డప్పు కృష్ణ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో కామ్రేడ్ డప్పు కృష్ణ 12వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు డప్పు కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. రైతుల కోసం భూ ఉద్యమంలో, ఇళ్ల స్థలాల ఉద్యమంలో ఆయన ఎంతో కీలకంగా వ్యవహరించారన్నారు. గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి, అంటరానితనాన్ని రూపుమాపడం కోసం జరిగిన ఉద్యమంలో డప్పు కృష్ణ చురుకైన పాత్ర పోషించారన్నారు. పేదలకు ఇళ్లు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ ప్రజలను చైతన్య పరిచి గ్రామాల్లో డప్పు కృష్ణ సైకిల్ యాత్ర నిర్వహించారన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

కడ్తాల్: మహనీయుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎస్ఐ వరప్రసాద్ అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు మంగళవారం సాయంత్రం ముగిశాయి. బహుమతి ప్రదానోత్సవానికి ఎస్ఐ వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. యువత బెట్టింగ్, చెడుదారులు పట్టకుండా మంచి భవిష్యత్‌కు మార్గం వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షుడు జావిద్, ఏఎస్ఐ చంద్రశేఖర్, నాయకులు లాయక్‌అలీ, జహంగీర్‌అలీ, గౌస్, జహంగీర్‌బాబా, ఇర్షాద్, లతీఫ్, ఇమ్రాన్‌బాబా, షఫీ, షకీల్, ఆసిఫ్, ఇమ్రాన్‌బాబా, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎస్ఐ వరప్రసాద్

నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరు



ఇబ్రహీంపట్నం: పోలీస్‌స్టేషన్ ఎదుట బీఆర్‌ఎస్ నేతలు



ఆమనగల్లు: పోలీస్‌స్టేషన్ ఆవరణలో బీజేపీ, బీజేవైఎం నాయకులు



యాచారం: సీపీఎం నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

హెచ్‌సీయూ ఆందోళనకు వెళ్లకుండా విపక్ష నేతల అరెస్టులు

ఇబ్రహీంపట్నం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)కి చెందిన 400 ఎకరాల భూముల వ్యవహారంపై విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా వెళ్తున్న బీఆర్‌ఎస్, సీపీఎం నేతలను మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేశారు. వారిలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.సామెల్, నేతలు సిహెచ్.జంగయ్య, పి.జగన్, బీఆర్‌ఎస్ నాయకులు జెర్కొని రాజు, జగదీశ్, శివసాయి, మహేశ్, కరుణాకర్, సురేశ్‌లను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

ఆమనగల్లు: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ భూముల వ్యవహారంపై తలెత్తిన వివాదంలో విద్యార్థులకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎన్ని ఒత్తిడిలు చేసిన సెంట్రల్ యూనివర్సిటీ భూములను అన్యాక్రాంతం కాకుండా అడ్డుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్‌రెడ్డి, వైస్ చైర్మన్ దుర్గయ్య, మాజీ కౌన్సిలర్లు నర్సింహ, లక్ష్మణ్, చెన్నకేశవులు, శ్రీధర్, ఆనంద్, రవిరాథోడ్, శ్రీనుయాదవ్ తదితరులు ఉన్నారు.

సీపీఎం శ్రేణుల ముందస్తు అరెస్టులు

యాచారం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని సందర్శించేందుకు వెళ్తున్న సీపీఎం శ్రేణులను యాచారం, గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టులు చేశారు. సీపీఎం, వ్యవసాయ కార్మిక, రైతు సంఘాలు, సీఐటీయూ నాయకులను అదుపులోకి తీసుకొని ఆయా పోలీస్‌స్టేషన్లలో ఉంచారు.

చెట్లను తొలగించొద్దు

తలకొండపల్లి: హైదరాబాద్ హెచ్‌సీయూలోని 400 ఎకరాల అటవీ భూమిలో నిర్మాణాలు చేపట్టరాదని బీఆర్‌ఎస్ నాయకుడు శంకర్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. పర్యావరణాన్ని మేలు చేసే చెట్లను తొలగిస్తే జీవిరాశి మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని చెప్పారు.